ప్రజాశక్తి
శుక్రవారం 18 అక్టోబరు, 2024
5
శ్రీకాకుళం



ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి- పలాస

పలాస ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా ఎం.కృష్ణమూర్తి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఆర్‌డిఒగా బాధ్యతలు స్వీకరించిన బి.సుదర్శన్‌దొర బుధవారం కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఇక్కడ ఆర్‌డిఒ పోస్టు ఖాళీ ఏర్పడడంతో టెక్కలి ఆర్‌డిం ఎం.కృష్ణమూర్తిని ఇన్‌ఛార్జిగా ఆర్‌డిఒగా నియమిస్తూ... కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణమూర్తికి సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది



కవిటి మండలంలో సముద్రం ఒడ్డున బోల్తా పడిన పడవులు

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. మరోవైపు జిల్లాలో పలుచోట్ల ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసాయి. వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పలు ప్రభుత్వశాఖల అధికారులతో సమావేశమయ్యారు. వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు అంతా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

'అల'కల్లోలం

- కవిటిలో ముందుకొచ్చిన సముద్రం
- వాయుగుండం ప్రభావంతో పలుచోట్ల వర్షాలు
- అప్రమత్తమైన అధికారులు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, కవిటి

జిల్లాలో వాయుగుండ ప్రభావంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. జిల్లాలో అత్యధికంగా వజ్రపుకొత్తూరు మండలంలో 60.75 మి.మీ వర్షపాతం నమోదైంది. సంతబొమ్మాళి మండలంలో 35.25 మి.మీ, మెళియాపుట్టిలో 33.25 మి.మీ, ఎచ్చెర్లలో 32.5 మి.మీ, గార మండలం బూరవెల్లిలో 26.75 మి.మీ వర్షం కురిసింది. సోంపేట మండలం బాతుపురంలో 23.75 మి.మీ, నరసన్నపేటలో 23 మి.మీ, ఆమదాలవలసలో 19.5మి.మీ, శ్రీకాకుళంలో 18.75మి.మీ, లావేరు, పొందూరులో చెరో 26.75 మి.మీ వర్షం పడింది. పలాసలో 14.25 మి.మీ, కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో 12.75 మి.మీ, ఇచ్ఛాపురంలో 8.5మి.మీ, నందిగాం మండలం మదనాపురంలో 8 మి.మీ, రణస్థలం మండలం పైడిభీమవరం 5.75 మి.మీ, జలుమూరులో 5 మి.మీ మేర వర్షం పడింది.

ముందుకొచ్చిన సముద్రం

ఉద్దానం తీర ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. ఎగిసిపడుతున్న అలలతో గురువారం ఉదయం సుమారు 120 మీటర్ల మేర సముద్రం ముందుకొచ్చింది. దీంతో అలల తాకిడికి లంగరు వేసుకున్న బోట్లు బోల్తా పడ్డాయి. ఇద్దివాణిపాలెం, బట్టివానిపాలెం, కర్రివానిపాలెం, కపాసుకుద్ది గ్రామాల్లో సముద్రం పూర్తిగా ముందుకు రావడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు బోట్లు బోల్తాపడడం, వలలు కొట్టుకుపోవడంతో మత్స్యకారులకు కొంతమేర నష్టం వాటిల్లింది. దీంతో పాటు గార మండలం బందరువానిపేటలోనూ సముద్రం వంద అడుగుల మేర ముందుకొచ్చింది.



శ్రీకాకుళం నగరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

అధికారులు అప్రమత్తం

వాయుగుండ ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి రెవెన్యూ, జలవనరుల శాఖ, తదితర అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. నాగావళి, వంశధార, బహుదా నదీ తీర గ్రామాల్లో కాలువ గట్లు, మరమ్మతులు ఏమైనా ఉంటే తక్షణమే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. వరదకు సంబంధించి ముందస్తు అంచనా వేసే పరికరాలు ఉన్నాయా? లేకపోతే వాటిని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫ్లడ్ మోనిటరింగ్ మీటర్లు ఉన్నది లేనిది జలవనరులశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ కంట్రోల్ రూం ఫోన్ నంబరు 08942-240557 తుపాను నష్ట సమాచారాన్ని తెలియజేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, సిపిఒ లక్ష్మీప్రసన్న, జలవనరుల శాఖ అధికారులు, సెట్విస్ సిఇఒ ప్రసాదరావు, ఇడిఎం ఇంద్రసేన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు, కృష్ణమూర్తి

9, 10న సిపిఎం జిల్లా మహాసభ

జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సిపిఎం జిల్లా మహాసభను నవంబరు 9, 10 తేదీల్లో పలాసలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 9న ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మహాసభల్లో గత కార్యక్రమాలు సమీక్షించి, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు ధరలు తగ్గించాలని, నిరుద్యోగం సమస్యపై, జమిలి ఎన్నికలు నిర్ణయం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. మహిళలపై అత్యాచారాలు అరికట్టాలని కోరుతూ నవంబరులో ప్రజాహోరు క్యాంపెయిన్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వాల్మీకికి నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనురాధ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ బి.శాంతిశ్రీ, ఆర్‌ఐఒ దుర్గారావు, గిరిజన సంక్షేమ శాఖ ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఎడి లియాఖత్ అలీఖాన్ పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

ఎస్‌పి కార్యాలయంలో...

ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఎఒ సిహెచ్.గోపీనాథ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక విధానాన్ని జిల్లాలో గురువారం నుంచి ప్రారంభించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గం గోపాలపెంట ఇసుక రీచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో జిల్లాలో ఐదుచోట్ల కొత్త రీచ్‌లను ప్రారంభించి పూర్తిస్థాయిలో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఆయా రీచ్‌ల్లో రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కూలీల ద్వారా ఇసుక తవ్వకాలు చేయించి, ఒడ్డున ఉండే స్టాక్ పాయింట్‌నకు ట్రాక్టర్ల ద్వారా చేరవేస్తామని చెప్పారు. అక్కడ నుంచి ప్రొక్లెయినర్ సహాయంతో 24 గంటల పాటు అవసరం మేరకు రీచ్‌లను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇటీవల ఆరు ఇసుక రీచ్‌ల్లో తవ్వకాల కోసం టెండర్లను పిలవగా, పూర్తిస్థాయిలో బిడ్లను దాఖలు చేయని, వారిని అనర్హులుగా గుర్తించామని అన్నారు. కావలసినంత సమయం ఇచ్చినప్పటికీ వాహనాల వివరాలను ఇవ్వని, వర్క్ ఎప్పటికి పూర్తి చేస్తామనే సమాచారం ఇవ్వని, అలాగే అఫిడవిట్లు దాఖలు చేయని వారిని ప్రక్రియ నుంచి తప్పించామని చెప్పారు. ప్రభుత్వం 16వ తేదీ నుంచి ఇసుక రీచ్‌లను ప్రారంభించాలని నిర్ణయించడంతో నామినేషన్ పద్ధతిపై గోపాలపెంట ఇసుక రీచ్‌ను ప్రారంభించామని స్పష్టం చేశారు. పాత టెండర్లను రద్దు చేశామని, త్వరలోనే రీ టెండర్లు పిలుస్తామని చెప్పారు. ఎటువంటి ఆటంకం కలగకుండా ఇసుక సరఫరా విధానం అత్యంత పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మున్సిపల్ టీచర్ల సమస్యలపై ఆందోళనలు ఉధృతం

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్
- పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలి
- డిఇఒ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మున్సిపల్ టీచర్ల సమస్యలను తక్షణం పరిష్కరించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్ హెచ్చరించారు. నగరంలోని స్థానిక డిఇఒ కార్యాయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన్న గురువారం ఉపాధ్యాయులు సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ముందుగా దీక్షను ప్రారంభించి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మున్సిపల్ హైస్కూల్లో మూడు, నాలుగు తరగతులను విలీనం చేశారు తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వలేదని చెప్పారు. మున్సిపల్ హైస్కూల్లో తగినంతమంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జిటి, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. అప్‌గ్రేడ్ పోస్టుల్లో మున్సిపల్ టీచర్లకు నవంబరులోగా ఉద్యోగున్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులైన వారిని అర్బన్ ఎంఇఒలుగా నియమించాలన్నారు. మున్సిపల్ టీచర్ల పిఎఫ్ ఖాతాలు నిరుపయోగంగా పడి ఉన్నాయని అన్నారు. జీతాల నుంచి మినహాయించే సొమ్ము వారి ఖాతాలకు జమచేసేందుకు గాని, ఖాతాల్లో ఉన్న సొమ్ము అవసరాలకు వినియోగించుకునేందుకు గాని అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ టీచర్లకు జిపిఎఫ్ ఖాతాలు వెంటనే తెరిపించాలని, మున్సిపల్ పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బంది నియమించేలా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్ల బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల సమస్యలపై ఎన్ని పర్యాయాలు వినతి పత్రాలు సమర్పించినా పరిష్కారానికి నోచుకోవడం లేదని చెప్పారు. ఉపాధ్యాయుల డిమాండ్లకు పరిష్కారం చూపనిపక్షంలో ఈ నెల 22న పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద 24 గంటల ధర్నా చేపడతామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి టి.వి.భాస్కరరావు, ఎస్.స్వర్ణకుమారి, మున్సిపల్ విభాగం కన్వీనర్ పి.సూర్యప్రకాశరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జెవివి రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, రాష్ట్ర కౌన్సిలర్ పి.అప్పారావు, నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.సీతారాం, టి.వైకుంఠరావు, తాతా రావు, ప్రసాద్, యస్.యస్.ప్రధాన్, కె.శాంతి ప్రియ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు సత్యాగ్రహ దీక్షకు వచ్చారు.



దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

జీడి పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ బాబూరావు

ప్రజాశక్తి- పలాస

ప్రపంచమే మెచ్చే విధంగా పలాస జీడి పరిశ్రమల స్థాయి తీసుకెళ్తానని, దీనికి రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం సంపూర్ణంగా అందిస్తామని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఎపిటిపిసి) చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. చైర్మన్‌గా ఎంపికైన తరువాత తొలిసారిగా పలాస పారిశ్రామికవాడ జీడి పరిశ్రమల సముదాయాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమల యజమానులతో మాట్లాడుతూ త్వరలో జీడి పరిశ్రమలకు మహర్దశ రానుందన్నారు. టిటిడికి పలాస జీడి పప్పు సరఫరా చేయడం శుభపరిణామమన్నారు. అన్నీ ఆలయాల్లో మొక్క జీడి పప్పును ప్రమోషన్ చేయడానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష, తాను చర్యలు తీసుకుంటామని స్పష్టం శారు. ఎపిటిపిసిని రాష్ట్రంలో అగ్రగామి సంస్థగా చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అందుకు తగిన విధంగా ప్రణాళికతో అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న హార్బర్లు వద్ద తమ సంస్థకు పది ఎకరాలు చొప్పున స్థలాలు ఇవ్వాలని కోరామని చెప్పారు. అందుకు సిఎం అంగీకారం తెలిపారని అన్నారు. వాటిలో పక్కా గిడ్డంగులు నిర్మించి అద్దెల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెడతామన్నారు. విశాఖపట్నం జిల్లా యారాడ వద్ద తమకు 40 సెంట్లు స్థలం ఉందని, అందులో భవనాలు నిర్మించి అద్దెలకు ఇవ్వనున్నామని చెప్పారు. ఇప్పటికే విశాఖలో ముఖ్యమైన ప్రాంతాల్లో హోటళ్లు, వేర్హౌస్ గోదాములు, షాపింగ్ మాల్స్ అద్దెకు ఇచ్చామని అన్నారు. వాటి ద్వారా ఆదాయం వస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రా అగ్రగామిగా ఉన్న తమ సంస్థ, విభజన తరువాత వెనుకబడిందన్నారు. దీన్ని అధికమించి దేశంలోనే మొదటిస్థానంలో ఉంచేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు బాబూరావుకు వ్యాపారవేత్త సంతోష్‌కుమార్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డొక్కరి శంకర్, సాసుమాన చంద్రమౌళి, కొరికాన శంకర్, యవ్వారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



జీడి వ్యాపారులతో సమీక్షిస్తున్న బాబూరావు

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బాలల రక్షిత గృహాల నిర్వహణపై సంబంధిత అధికారులతో, స్వచ్ఛంద సంస్థలతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. జిల్లాలో 11 బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 13 బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా బాలల సంరక్షణ కేంద్రాలు నిర్వహించే కేంద్రాలపై కేసు నమోదు చేయాలన్నారు. అనుమతులు లేని బాలల సంరక్షణ కేంద్రాలను తక్షణమే మూయించాలని ఆదేశించారు. వసతిగృహాల్లో ఖాళీలు ఉన్నాయని, రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న బాలల సంరక్షణ కేంద్రాల్లోని బాలలను ప్రభుత్వ వసతిగృహాల్లో చేర్పించాలని అన్నారు. వసతిగృహాల్లో సీట్ల కేటాయింపుకు డిఇఒ, ఐసిడిఎస్ పీడీలతో కమిటీ ఉంటుందని స్పష్టం చేశారు. బాలల కోసం ఫిర్యాదులు వస్తే కమిటీకి తెలియజేయాలన్నారు. సమస్య లేకుండా చూడాలని కమిటీని ఆదేశించారు. బాలలు రక్షిత గృహాల్లో దత్తతకు అర్హులైన బాలల వైద్య పరీక్షల నివేదికలు వెంటవెంటనే మహిళా శిశు సంక్షేమ అధికారికి సమర్పించాలన్నారు. ప్రయివేటు వసతిగృహాలు రిజిస్ట్రేషన్లు డిఇఒ వద్ద చేయించుకోవాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలు ప్రభుత్వ పరంగా స్వచ్ఛంద సంస్థలు బాలల న్యాయ చట్టం ప్రకారం, ప్రభుత్వ నిబంధనలు అనుసరించి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్నదని చెప్పారు. అనంతరం మునగ చెట్టు మహిళలకు ఆరోగ్యానికి తొలిమెట్టు అనే పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష, డిఎంహెచ్‌ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, బాలల సంరక్షణ అధికారి కె.రమణ, ఆర్‌ఐఒ దుర్గారావు, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్‌రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంక్షేమ అధికారి అనురాధ, విద్యాశాఖ ఎడి లియాఖత్ అలీఖాన్, గిరిజన సంక్షేమశాఖ ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'పల్లె పండగ'తో గ్రామాలాభివృద్ధి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

పల్లెల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని కల్లేపల్లి, పి.జి.పేట, నైర, పొన్నాం, బట్టేరు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతానని అన్నారు. ఏ గ్రామంలో ఏ పనులు అవసరమో వాటిని పూర్తి చేసేందుకు అందుకు తగ్గ నిధులు కూడా విడుదల చేశామన్నారు. మంచి పాలన అందించడమే పాలకుల లక్ష్యమని, అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున కల్పించేందుకు మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి వారం రోజులపాటు నిర్వహించనున్న పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో సిసి రోడ్లు, బిటి రోడ్లు, సిసి డ్రైన్లు, గోకులాలను పెద్ద ఎత్తున అన్ని గ్రామాల్లో నిర్మిస్తామన్నారు. ఉపాధి నిధులతో నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్‌లు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమ పాలనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తూ పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా కృషి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ, నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పాఠశాలల పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని చిలకపాలెం ప్రభుత్వ ఉన్న, మండల పరిషత్ పాఠశాలలు, పోలీస్ బేరెక్స్ స్కూల్, ఫరీదుపేట జిల్లా పరిషత్ ఉన్నత, కుశాలపురం ఎంపియుపి పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించా ఆరా తీశారు. పాఠశాలల పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. అనంతరం వారికి చట్టాపై అవగాహన కల్పిస్తూ... తగు పరిష్కార మార్గాలను వివరించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని వంజంగిపేట, దూసిపేట గ్రామాల్లో గురువారం నిర్వహించిన పల్లె పండగ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దూసిపేటలో రవికుమార్ మాట్లాడుతూ తీవ్ర ఆర్థిక లోటు ఇబ్బందులతో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమం, రెండు కళ్లు గా భావించి కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో నియోజకవర్గంలోని ఏ గ్రామానికీ రోడ్లు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలను పట్టించుకోలేదన్నారు. ప్రధాన రహదారులు పూర్తిగా అధ్వాన స్థితికి చేరుకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ మాజీ సిఎం పట్టించుకోకుండా అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. అలాగే గ్రామ సచివాలయం ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని లేని, యెడల కఠిన చర్యలు తప్పని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రోణంకి వెంకటరావు, టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, విద్యాసాగర్, అప్పలనాయుడు, నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, కంచరాన లోకేష్, ఎండ అప్పలనాయుడు సర్పంచ్ పైడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- మందస

సాంఘిక, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ రఘువర్మ హామీనిచ్చారు. మండలంలోని మందస, బీపీ, కిల్లోయి, బుడంబో, చిన్నబోర్న, పట్టులోగాం ఆశ్రమ పాఠశాలలు, ఆర్.కె.పురం సాంఘిక సంక్షేమ పాఠశాల, సిరిపురం, కృష్ణాపురం ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ప్రాతిపదికన వార్డెన్, ఎఎన్ఎం పోస్టుల భర్తీ, సిఆర్‌టిలను రెగ్యులర్‌పై కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గవ్వ భీమారావు, మండలశాఖ అధ్యక్షుడు ఎస్.కిరణ్‌కుమార్, వి.వి.వరప్రసాద్, ఎస్. కరుణాకర్, డి.వైకుంఠరావు, ఎన్.దిల్లేశ్వరరావు, బి.భైరాగి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ అప్పారావు

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


మండలంలోని జగన్నాథపురం పాఠశాలను ఎంఇఒ కె.అప్పారావు గురువారం వార్షిక తనిఖీ చేశారు. ఈ వార్షిక తనిఖీలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. ప్రతి విద్యార్థి ధారాళంగా చదవడం, రాయడం, గణిత భావనలో చతుర్విధ ప్రక్రియలు అవగాహన చేసుకుని సరైన పద్ధతిలో విద్యార్థులు అభ్యసన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆంగ్ల భాష పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, డిక్షనరీ వినియోగం ప్రతి విద్యార్థి అవగాహన పర్చుకోవాలని అన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు. సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

'అంగన్వాడీ'లో వసతులు కల్పించాలి

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని పీకే స్ట్రీట్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రానికి వసతిఏర్పాటు చేయాలని జై భీమ్ సేన జిల్లా అధ్యక్షుడు బుష్క ఈశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు నగిరి మోహనరావు ఒక ప్రకటనలో కోరారు. కొన్నేళ్లుగా పాఠశాల భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రానికి వసతి ఇవ్వలేమంటూ సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు చెప్పడంతో 15 రోజులుగా చిన్నారులు ఇంటికే పరిమితమయ్యారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాలు అందక వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రం నిర్వహణకు శాశ్వత వసతి భవనం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఆదికవి వాల్మీకి



సరుబుజ్జిలి : నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగేంద్ర తదితరులు

ప్రజాశక్తి- కవిటి

ఆదికవి వాల్మీకి చరిత్ర విద్యార్థులకు ఆదర్శనీయమని కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని గురువారం పాఠశాల ఆవరణలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటవిక గిరిజన తెగకు చెందిన వాల్మీకి అకుంఠిత దీక్షతో మహర్షిగా మారి ప్రపంచానికి రామాయణం వంటి మహాకావ్యాన్ని అందించారని కొనియాడారు. వాల్మీకి చరిత్రను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదువులో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక శాఖాగ్రంథాలయంలో వాల్మీకి చిత్రపటానికి గ్రంథాలయ అధికారి కె.ఉదయ్ కిరణ్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వాల్మీకి చిత్ర పటానికి ప్రిన్సిపాల్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, లీలాపద్మజ, టి.త్రినాథరావు, జగన్నాథ బిసాయ్, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు.



కవిటి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

పలాస : పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి చిత్రపటానికి ప్రిన్సిపాల్ వై.వెంకటలక్ష్మి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్. గణపతి రావు, పీడీ డాక్టర్ మధు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ వెంకట రమణ, అధ్యాపకులు నరసింహులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని ఊడికలపాడు వాల్మీకి చిత్రపటానికి శ్రీరామక్షేత్రంలో ఆలయ ధర్మకర్త సనపల కరుణ్‌కుమార్, దుర్గంపేట ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, మెండ తిరుపతిరావు, దుప్పల ఆనందరావు పాల్గొన్నారు.

'పల్లె పండగ'తో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- నరసన్నపేట

పల్లె పండగలో భాగంగా మండలంలోని ముషిడిగట్టు ఆర్‌అండ్‌బి రోడ్డు ఉప్పరపేట, లుకలాం వరకు ఉపాధి హామీ కింద రూ.2.0 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, ఎంపిడిఒ, పంచాయతీరాజ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని తెలుకుంచి పంచాయతీల్లో పల్లె పండగలో భాగంగా పలు అభివృద్ధి పనులకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిని నాయకులు మెరుగు సూర్యనారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రోకళ్ల భాస్కర్, కర్రి నాగరాజు, సంతోష్, రంగ, ఎన్.రఘు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం, గంగరాజపురం, శేఖరాపురం గ్రామాల్లో పల్లెపండగలో భాగంగా సిసి రోడ్ల నిర్మాణానికి టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్జ లలితకుమారి, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండాలు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఇసి ఆదినారాయణరెడ్డి, టిపి ఢిల్లీరావు, తిరుపతిరావు, శశిభూషణ్, చక్రి, శంకర్, రమేష్, కార్యదర్శి ఎన్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.



నరసన్నపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట పంచాయతీలో సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపిటిసి మాజీ సభ్యులు మట్ట లక్ష్మణరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్, టిడిపి నాయకులు ఇరానిటి రాజు, ధర్మాన నాగరాజు, కృష్ణవర్ధన్‌బాబు పాల్గొన్నారు.

లావేరు: పల్లెపండగా ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని గురుగుబిల్లి సర్పంచ్ బాడిత కళ్యాణి అన్నారు. గురువారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తాళ్లవలస గ్రామ పంచాయతీలో రోడ్డు నిర్మాణానికి మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్ భూమి పూజ చేశారు. ఎపిఒ సత్యవతి, టిడిపి నాయకులు దారపురెడ్డి కూర్మారావు, బాడిత చిట్టిబాబు, హరికృష్ణ, బి. వీరభద్రరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో తనిఖీలు



పరిసరాలను పరిశీలించిన జడ్జి ప్రసన్నలత

కోటబొమ్మాళి: వసతిగృహాల్లో పరిశుభ్రత పాటించకపోతే ఎలా అని, అపరిశుభ్రంగా ఉంటే విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశం ఉందని, వెంటనే పరిశుభ్రత, పారిశుధ్య పనులు చేపట్టాలని జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత ఆదేశించారు. కోటబొమ్మాళి వెనుకబడిన తరగతుల బాలుర, సాంఘీక సంక్షేమ బాలికల వసతిగృహాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వసతి, ఆహార, వైద్య, విద్య వంటి అంశాలను తనిఖీ చేశారు. సాంఘీక సంక్షేమ బాలికల వసతిగృహంలో పరిశుభ్రత పాటించటం లేదని, భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడాన్ని గుర్తించారు. అలాగే స్థానిక జూనిర్ సివిల్ కోర్టులో పోలీస్, ఎక్సైజ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లోని రాజీ పడే క్రిమినల్ కేసులను ముందుగానే గుర్తించి వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. డిసెంబరు 14న జరుగు లోక్‌ఆదాలత్‌కు ఎక్కువ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు 'ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్'

శ్రీకాకుళం: ఈ నెల అక్టోబరు 18న ఉదయం 10 గంటలకు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వినతుల స్వీకరిస్తామని, ఈ అవకాశాన్ని జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని 11 కెవి భైరిపురం ఫీడర్‌లో చెట్లు కొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి భైరిపురం ఫీడర్‌లోని డి.జి.పుట్టుగ, నెల వంక, కపాసుకుద్ది పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని నీలాదేవిపురం గ్రామానికి చెందిన కంచిపల్లి తవిటినాయుడు (44) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఎస్ఐ ప్రవళ్లిక వివరాల మేరకు నాలుగేళ్ల క్రితం ఒక ప్రమాదంలో మతిస్థిమితం కోల్పోయాడు. గతంలో ఇదే విధంగా రెండుసార్లు పాయిజన్ తీసుకున్నాడన్నారు. జీవనం తన భార్య తన స్వగ్రామం సంతకవిటి మండలంలో ఒక ఫంక్షన్‌కు వెళ్లడంతో ఈయన గడ్డి మందు సేవించాడు. తాను గడ్డిమందు సేవించినట్టు గ్రామస్తులకు చెప్పడంతో చికిత్స నిమిత్తం గ్రామస్తులు ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరులు అరెస్టు

పొందూరు: మండలంలోని బురిడి కంచరాం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. జూదరుల వద్ద గల రూ.37,600 నగదుతో పాటు ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కిరాణా షాపు దగ్ధం

సోంపేట: మండలంలోని బారువలో స్టేట్ బ్యాంకు పక్కనే ఉన్న కిరణా షాపులో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదం రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన పెల్లాన శ్రీనివాస్‌గుప్త దుకాణంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు అప్రమత్తమై అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. అగ్ని మాపక సిబ్బంది ఎస్.మోహనరావు, డి.భాస్కర రావు, ఎల్. నరేష్, ఆర్.లక్ష్మణమూర్తి, సిహెచ్. విజయ కుమార్‌లు శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు.



అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాస

నేరాలపై అప్రమత్తం

ఇచ్ఛాపురం: నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాస అన్నారు. గురువారం ధర్మాపురం, లొద్దపుట్టి గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు, నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు తరుచుగా జరుగుతున్నాయని, ప్రజలు ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న పిఒ శోభారాణి

కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకోవాలి

టెక్కలి: సమగ్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రా పరిసరాల్లోని ఖాళీగా ఉన్న స్థలాల్లో కిచెన్ గార్డెన్స్‌ని ఏర్పాటు చేసుకోవాలని ఐసిడిఎస్ పిఒ శోభారాణి సూచించారు. టెక్కలి అంగన్వాడీ కేంద్రంలో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, పుట్టబోయే, పుట్టిన శిసువులకు సేంద్రీయ ఎరువులతో తయారు చేసిన కూరగాయలు, ఆకుకూరలు వినియోగించుకునేలా చూడాలన్నారు. శిక్షకులుగా బాలకృష్ణ లోకేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం

ప్రజాశక్తి- పలాస

బాల్యవివాహాలు చట్టరిత్యా నేరమని పలాస లేబర్ అధికారి మట్ట విజయకుమార్ అన్నారు. కాశీబుగ్గ ఎఎస్ఐ, చైల్డ్ లైన్ సిబ్బందితో కలిసి పలాస రైల్వే స్టేషన్‌లో బాల్యవివాహాలు కలిగే అనర్థాలను, చైల్డ్‌లైన్ పిల్లల గురించి గురువారం అవగాహన కల్పించారు. చైల్డ్‌లైన్ పిల్లల గురించి రైల్వేస్టేషన్ అంతా కలియ తిరిగారు. పలాస-కాశీబుగ్గలోని వివిధ షాపుల్లో భాలకార్మికుల గురించి పరిశీలించారు. కార్య క్రమంలో సిఎంఆర్‌జి ఉర్నాన అప్పలరాజు పాల్గొన్నారు.

జీవామృతంపై అవగాహన

మందస : సేంద్రీయ పద్ధతిలో పంటలను పండిస్తే పౌష్టికాహారంతో పాటు అధిక లాభాలు వస్తాయని మండల కమ్యూనిటీ రీసెర్స్ పర్సన్లు కె.లక్ష్మణ్, పి.కృపాసింధు, పాపయ్య, సనత్ బాలకృష్ణ అన్నారు. ఐసిడిఎస్ సిడిపిఒ కె.వసుంధరాదేవి ఆధ్వర్యాన అంగన్వాడీ కేంద్రంలో ఘన, ద్రవ జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. సేంద్రీయ పద్ధతితో పండించి పిల్లలకు ఆకుకూరలు పెట్టాలన్నారు. చిరుధాన్యాల్లో అధిక మోతాదులో పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రసాద్‌గూడో, సవర కస్తూరి, భారతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ భవిష్యత్ భరోసాకు బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 296వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా గురువారం దీక్షలో పాల్గొని మాట్లాడుతూ తమకు గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



దీక్షలో పాల్గొన్న యువకులు

ఎస్‌పిని కలిసిన పోలీసు అధికారులు



ఎస్‌పికి మొక్కను అందజేస్తున్న సత్తిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డిని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎపిఎస్‌పి మొదటి బెటాలియన్ అదనపు కమాండెంట్ పి.సత్తిబాబు, కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.తిరుపతిరావు, డిసిఆర్‌బి ఎస్ఐ ఎం.డి.అమీర్ అలీ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఎపిఎస్‌పి (ఎచ్చెర్ల) మొదటి బెటాలియన్ అదనపు కమాండెంట్‌గా సత్తిబాబు గురువారం ఎచ్చెర్లలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈయన ఇంటెలిజెన్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై బెటాలియన్ అదనపు కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు.

నాయక్‌కు ఉత్తమ విలన్ అవార్డు

ప్రజాశక్తి- పలాస

అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షతన సమావేశం గురువారం నిర్వహించారు. 'ఎవడు సినిమాకి వాడే హీరో' సినిమాలో ప్రతి నాయకుడు పాత్రలో ప్రతిభ కనబరిచినందుకు పలాసకు చెందిన డాక్టర్ కుమార్ నాయక్‌కు ఉత్తమ విలన్ అవార్డును అందజేశారు. కంచలంక ఫిలిం ఛానల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిత్తరంజన్ నాయక్, ఒడియా ఫిలిం డైరెక్టర్ సుధాకర్ బసంత్, ఒడియా ఫిలిం యాక్టర్ అండ్ యాంకర్ గుడి పాత్ర, ఐఎఫ్ఎంఎ ఇంటర్నేషనల్ చైర్మన్ హెచ్ఆర్ దిలీప్, జాతీయ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఒడియా, తెలుగు, కన్నడ, హిందీ, తమిళ్ భాషల అగ్ర నటీనటులందరూ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్



మందులను వేస్తున్న పశువైద్య సిబ్బంది

నట్టల నివారణ మందులు పంపిణీ

కోటబొమ్మాళి: ప్రభుత్వం ఉచితంగా వేయిస్తున్న నట్టల నివారణ మందులను జీవాల కాపరులు వినియోగించుకోవాలని ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ అన్నారు. మండలంలోని చీపుర్లపాడు, కన్నే వలస పంచాయతీల్లో గురువారం నిర్వహించిన ఉచిత సామూహిక నట్టల నిర్మూలన మందుల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పశువైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సుమారు 850 జీవాలకు ఉచితంగా నట్టల నివారణా మందులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ మందులు వాడటం వల్ల జీవాల బరువు పెరుగుతాయని, దీంతో ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థక సహాయ కులు ఎస్.వెంకటరమణ, రావాడ రాజేష్, చల్ల రాము పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు స్పందన

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. రాష్ట్ర ఉపాధి నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖా ఆధ్వర్యాన ఈ జాబ్‌మేళా నిర్వహించామని అన్నారు. నాలుగు ప్రయివేట్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారని అన్నారు. 159 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనగా, వీరిలో 67 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని చెప్పారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఇది ఒక మంచి ఆవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్ కుమార్, ఆర్.రామారావు, కందిగొళ్ల, లూక్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

అర్బన్ క్రూయిజర్ టైజర్ విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం

టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) గురువారం పెద్దపాడు టొయోటో షోరూమ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్ అర్బన్ క్రూయిజర్ టైజర్ లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేశారు. ఈ ప్రత్యేక ఎడిషన్, స్టైల్ ప్రీమియం నెస్‌ని మెరుగుపరచడంపై దృష్టి సారించి రూపొందించబడిందని టొయోటా కిర్లోస్కర్ మోటార్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ ప్రతినిధి శబరి మనోహర్ తెలిపారు. కస్టమర్‌లకు ఈ పరిమిత ఎడిషన్ రూ. 20,160 విలువ కలిగిన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఎ) ప్యాకేజీతో వస్తుందన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను ఇటీవలే పరిచయం చేసిన తర్వాత అర్బన్ క్రూయిజర్ టైజర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. 1.0లీ టర్బో 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లో ఇది లభిస్తుందన్నారు. సమీప డీలర్ షిప్‌లోగాని, ఆన్‌లైన్ లో గాని బుక్ చేసుకోవచ్చని చెప్పారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న నాబార్డు జిల్లా మేనేజర్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్ కృష్ణ అన్నారు. గురువారం మండలం కేంద్రం జె.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో నాబార్డు ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం అమరావతి ఆర్థికసాయంతో యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 30 మంది స్వయంశక్తి సంఘాల మహిళలకు చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారీలో ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలనుద్దేశించి మాట్లాడుతూ నాబార్డు ద్వారా ఈ శిక్షణను ఉపయోగించుకుని పిఎం ఎఫ్ఎంఇ పథకాలతో రుణాలు పొంది సొంతంగా యూనిట్లను నెలకొల్పి చిరుధాన్యాలతో చేసిన ఉత్పత్తులు తయారు చేసి అభివృద్ధి చెందాలన్నారు. అదే విధంగా ఆహార పదార్థాల తయారీలో లైసెన్సులు పొంది ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు ప్రజలకు అందించాలన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సునీత, బివైసి అధ్యక్షులు మేడూరి ప్రసాదరావు మాట్లాడుతూ ఆహార పదార్థాల తయారీలో నాణ్యత, పరిశుభ్రత అవసరమని, అలాగే ఉత్పత్తులు ప్యాకేజీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అవసరమైన యంత్ర పరికరాలు అందించడం, మార్కటింగ్‌లో సామాజిక మాధ్యమాల ద్వారా, ఆన్‌లైన్ ద్వారా ఉత్పత్తులు విక్రయాలు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ, సిఇఒలు శ్రీనివాసరావు, రెడ్డి గౌరినాయుడు, దుర్గారావు, మహిళలు పాల్గొన్నారు.

తప్పుడు విమర్శలు మానుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని వైసిపి ఇన్‌ఛార్జి పదవి కోసం పోటీపడుతున్న వైసిపి నాయకులు ఇతరులపై విమర్శలు మానుకోవాలని రాష్ట్ర టిడిపి లీగల్‌సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు బోర గోవిందరావు, తంగి గురయ్యలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న నాలుగు వైసిపి గ్రూపులు ఆదిపత్య పోరులో భాగంగా ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై అసత్య ఆరోపణలతో పోటాపోటీగా విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. పిల్ల వైసిపి నాయకులతో పాటు రాష్ట్రమంత్రి, శాసనసభాపతిగా బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి కూడా అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. అధికార ప్రభుత్వాన్ని విడిచిపెట్టి నిస్వార్థ రాజకీయాలతో ప్రజల మధ్య నిరంతర శ్రామికుడిలా శ్రమిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్‌పై లేనిపోని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మరన్నారు. వీరితో పాటు టిడిపి నాయకులు నాగళ్ల మురళీధర్ యాదవ్, జి.డి.ప్రసాద్, ఇంజరాపు విశ్వనాథం ఉన్నారు.



మాట్లాడుతున్న విద్యాసాగర్

టెక్కలిలో మద్యం సిండికేట్

చక్రం తిప్పుతున్న తమ్ముళ్లు

ప్రజాశక్తి- టెక్కలి

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి పట్టణంలో మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యేందుకు తెరవెనుక మంతనాలు జరుపుతున్నారు. పట్టణంలో ఏడు మద్యం దకాణాలకు లైసెన్స్‌లు మంజూరయ్యాయి. వీటిలో ముగ్గురు లైసెన్స్ దారులు ఇప్పటికే సిండికేట్‌గా మారారు. వీరికి మంత్రి అనుచరుడు, కనుసన్నల్లో పట్టణాన్ని శాసిస్తున్న ఒక వ్యాపారి ముగ్గురు లైసెన్స్ వ్యాపారులను సిండికేట్‌గా మార్చారు. 39 మంది వ్యాపారస్తులతో ఒక్కటిగా మారినప్పటికీ అదనంగా ఉన్న మరో నాలుగు దుకాణాలపైనా అనుచరుడు కన్నేసి వారినీ తమలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చాడు. అయితే వీరిలో ఇద్దరు లైసెన్స్ హోల్డర్స్ మాత్రం సదరు వ్యాపారితో సిండెకేట్ అయ్యేందుకు ససేమిరా అంగీకరించలేదు. అయితే వీరూ టిడిపికి చెందిన ముఖ్య ద్వితీయ శ్రేణి నాయకులు. పట్టణంలో మద్యం సిండికేట్‌గా మార్చి తమకు తోచిన విధంగా ధరలు పెంచుకోవచ్చుననే ఆలోచనతో మద్యం హోల్డర్స్ ఉండడం గమనార్హం.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి



చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

టెక్కలి రూరల్: స్థానిక ఎస్‌సి బాలుర వసతి గృహంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి పలువురు మాట్లాడుతూ తన జీవితం విద్యార్థులకు, ప్రజలకు అంకితం చేశారన్నారు. ఈయనపై అక్రమ కేసులు బనాయించి తొమ్మిదేళ్లు నిర్బంద జైలు జీవితాన్ని అనుభవించారుని, దేశద్రోహం కేసులు పెట్టి అండజైలులో నిర్బందించారన్నారు. నిర్దోషిగా బయటికి వచ్చిన అనంతరం కొద్ది రోజులు మాత్రమే బతికి తనువు చాలించి తన దేహాన్ని పరిశోధనల నిమిత్తం ఆయన కోరిక మేరకు గాంధీ వైద్య కళాశాలకు అప్పగించడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయాలకు కట్టుబడి పని చేయడమే ఆయనకు మనమిచ్చే ఘననివాళి అన్నారు. కార్యక్రమంలో జిల్లా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కురామన దాలయ్య, ప్రొఫెసర్ కసవయ్య, బి.చిన్నవాడు, పిఆర్‌టియు జిల్లా గౌరవ అధ్యక్షులు బాబురావు, విశ్రాంతి ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఆట్ల రాహుల్ కుమార్, నిరుద్యోగ పోరాటసమితి జిల్లా నాయకులు టి.సూర్యం, విద్యార్థులు పాల్గొన్నారు.